సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎన్నికల కంట్రోల్ రూమ్ ప్రారంభం



కంట్రోల్ రూమ్

గాజువాక: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు గాజువాకలో ఎన్నికల కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్‌ను ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కంట్రోల్ రూమ్‌తో పాటు కాల్ సెంటర్ మాదిరిగా పని చేస్తుందని, 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎలాంటి సమాచారం ఉన్నా, ఫిర్యాదులు ఉన్నా ఇక్కడి సిబ్బందికి తెలియజేయవచ్చన్నారు. 0891-2760025, 8555085615 నంబర్ల ద్వారా సమాచారం తెలియజేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి లక్ష తులసీదళార్చన



లక్ష తులసి పూజ చేస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజను ఘనంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం రుత్వికులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అర్చన చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావ నారాయణ స్వామి, హరి నారాయణ స్వామి ఆధ్వర్యంలో రుత్వికులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

'స్పందన' కొనసాగింపునకు వినతి

గాజువాక: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలని జిల్లా పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి కోరారు. స్పందన కార్యక్రమం పదేళ్ల నుంచి కొనసాగుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 7వ తేదీ వరకు నిలిపివేయడం సబబు కాదన్నారు. పేదలు, దళితులు, గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయానికి ప్రతీ సోమవారం వస్తున్నందున స్పందనను కొనసాగించాలని ప్రకటనలో కోరారు. ప్రత్యామ్నాయ విధానం ద్వారా జనన, మరణ, కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువపత్రాలను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి, శిక్షణపై ఎంవోయూ

అగనంపూడి: ఉపాధి, నైపుణ్య శిక్షణ, అవగాహన కార్యక్రమాలపై పరస్పర సహకారం అందించే లక్ష్యంతో దువ్వాడలోని ఫార్మాస్యూటికల్ కళాశాల, సీఎస్‌సీ అకాడమీ ఒప్పందం చేసుకున్నాయి. ఈ మేరకు దువ్వాడలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, సీఎస్‌సీ అకాడమీ సలహాదారు రామ్మోహనరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కమలకుమారి, ఫార్మా హెచ్ఓడీ సరిత, శిక్షణ, ఉపాధి డీన్ వసుధ తదితరులు పాల్గొన్నారు.

హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో గత నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా జరిగిన పరీక్షల్లో 36 మందికి గానూ 25 మంది ప్రథమ శ్రేణిలో, 11 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

కొండవాలు.. అభివృద్ధి పరవళ్లు

వార్డులో వెచ్చించిన నిధులు రూ.11.36 కోట్లు

పూర్తయిన పనులు రూ.7.36 కోట్లు

ప్రోగ్రెస్‌లో ఉన్నవి, శంకుస్థాపనలు జరిగినవి రూ.4 కోట్లు

- ముందెన్నడూ లేనివిధంగా మౌలిక వసతులు
- 71వ వార్డులో రూ.11.36 కోట్లతో పనులు
- నివాసితుల హర్షాతిరేకాలు



అరుణోదయ కాలనీలో మెట్ల మార్గం

గాజువాక: నియోజకవర్గ పరిధిలోని వార్డులు అభివృద్ధికి చిరునామాగా నిలిచాయి. జీవీఎంసీ పాలకవర్గం అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చి, ప్రతీ వార్డుకు కోట్ల రూపాయల్లో నిధులను మంజూరు చేయడంతో ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉండగా, ఇంకొన్ని పనుల నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపనలు కూడా చేశారు. గాజువాకలోని ఒక్క 71వ వార్డులోనే సుమారు రూ.11.36 కోట్ల వ్యయంతో వివిధ వసతులను అందుబాటులోకి తేవడంలో భాగంగా రూ.7.36 కోట్ల విలువైన అభివృద్ధి పనులను పూర్తి చేశారు. కాగా, మరో రూ.4 కోట్ల విలువైన పనుల్లో కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరికొన్ని పనులకు ఇటీవల శంకుస్థాపనలు చేశారు.

అభివృద్ధి మెరుపులు

- సుందరయ్య కాలనీలో రూ.32 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మించారు.
- రూ.25 లక్షలతో అరుణోదయ కాలనీలో మూడు సీసీ రోడ్లు, డ్రైన్‌లు, మెట్ల మార్గం నిర్మించారు.
- రూ.18లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపన చేశారు.
- రూ.40 లక్షలతో దుర్గానగర్‌లో బీటీ రోడ్ నిర్మించారు.
- రూ.22 లక్షలతో నాగ నూకమాంబ కాలనీ కొండపై రెండు సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు.
- రూ.22 లక్షలతో శివసాయినగర్ కొండపై డ్రైనేజీలు, రోడ్లు, మెట్ల మార్గం నిర్మాణం
- ఇదే కాలనీలో రూ.14 లక్షలతో కొత్తగా నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు.
- శివసాయినగర్ దిగువన రూ.10 లక్షలతో డ్రైన్‌ల నిర్మాణం
- శ్రీనగర్ రామాలయం ఆర్చి వద్ద రూ.10లక్షలతో డ్రైన్‌ల నిర్మాణం, మరమ్మతులు
- మరో రూ.10 లక్షలతో మెట్ల నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేశారు.
- శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో రూ. 25 లక్షలతో బీటీ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం, రూ.12 లక్షలతో కొండపైకి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశారు.
- శ్రీరామ్‌నగర్ ఏరియా నూకాలమ్మ గుడి ప్రాంతానికి రూ.12.85 లక్షలతో మెట్లు, డ్రైన్లు, రెండు కల్వర్టుల నిర్మాణం
- ఉప్పర కాలనీ ప్రాంతంలో రూ.15 లక్షలతో డ్రైన్‌ల నిర్మాణం
- ఇదే కాలనీలోని సామాజిక భవనానికి రూ.18 లక్షలతో రిటైనింగ్ వాల్, డ్రైనేజీలు నిర్మించారు.
- దిబ్బపాలెం, ఉప్పర కాలనీలో రూ.10 లక్షలతో సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణం
- దిబ్బపాలెం ఏరియాలోని వివిధ వీధుల్లో రూ.37 లక్షలతో డ్రైన్‌లు, సీసీ రోడ్ నిర్మాణం
- దిబ్బపాలెం రామాలయం ఎదురుగా గ్రౌండ్‌లో రూ.3 లక్షలతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, రూ.18.35 లక్షలతో పార్కు అభివృద్ధి చేశారు.
- శ్రీరామ్‌నగర్‌లోని వివిధ వీధుల్లో రూ.94 లక్షలతో సీసీ రోడ్, డ్రైన్ల నిర్మాణం, బీటీ రోడ్లకు ప్యాచ్ వర్కులతో నిర్వహణ పనులు చేపట్టారు.
- సుందరయ్య కాలనీ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా కొండపైకి రూ.10 లక్షలతో మెట్ల మార్గం, డ్రైన్లు ఏర్పాటు చేశారు.



కొండవాలు ప్రాంతంలో నిర్మించిన రిటైనింగ్ వాల్

- గురునాథరావు కాలనీలో రూ.10 లక్షలతో రోడ్, డ్రైన్ నిర్మాణం
- విశ్వేశ్వరాయనగర్ కాలనీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్ నిర్మాణం, 12 లక్షలతో పార్కు అభివృద్ధి, 19 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం
- గాయత్రి పెట్రోల్ బంక్ ఎదురుగా రూ.16 లక్షలతో రోడ్ల నిర్వహణ చేపట్టారు.



తోకాడ కాలనీలో సీసీ రోడ్

- గాజువాక పోలీస్ స్టేషన్ పక్కన రూ.8 లక్షలతో కల్వర్టు విస్తరించారు.
- కుంచుమాంబ కాలనీ, దత్తసాయినగర్ మధ్య ప్రాంతంలో రూ.36 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, రూ.18 లక్షలతో కుంచుమాంబ కాలనీ, దత్తసాయినగర్‌లకు కొత్తగా వాటర్ డిస్ట్రిబ్యూషన్ లైన్ ఏర్పాటు చేశారు.
- సాయిబాబా ఆలయం వెనుక భాగంలో రూ.10 లక్షలతో గెడ్డకు రిటైనింగ్ వాల్ నిర్మాణం
- తోకాడలో రూ.10లక్షలతో ఆర్ఆర్ డ్రైన్, 20 లక్షలతో సీసీ రోడ్లు, 50లక్షలతో డ్రైన్‌లు, సీసీ రోడ్‌ల నిర్మాణం
- రూ.50 లక్షలతో తోకాడ శ్మశానం అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించాల్సి ఉందని అధికారులు తెలిపారు. కాగా, రూ.50 లక్షలతో విశ్వేశ్వరాయనగర్ కాలనీ శ్మశానం అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం గ్రౌండ్ లెవెలింగ్ వర్క్‌ను పూర్తి చేశారు.
- ఆటోనగర్‌కు రూ.10 లక్షలతో బీటీ రోడ్ నిర్మాణం పూర్తి చేయగా, మరో రూ.18.30 లక్షలతో సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు.
- రూ.3.76 కోట్లతో తోకాడ, కుంచుమాంబ కాలనీ వరకు యూజీడీ, సీసీ డ్రైన్లు, కల్వర్టు, వాటర్ లైన్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు.
- 50 లక్షలతో శ్రీనగర్ జంక్షన్ విస్తరణకు శంకుస్థాపన చేశారు.
- 49 లక్షలతో పోలీస్ స్టేషన్ సిగ్నల్ జంక్షన్ విస్తరణ పనులను చేపట్టారు. ప్రస్తుతం కల్వర్టుల నిర్మాణాన్ని పూర్తి చేశారు.

రోడ్లు, కాలువలు వేశారు



మా ఏరియాలో రోడ్లు, కాలువలు అస్తవ్యస్తంగా ఉండేవి. దీంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ఆ సమస్య పరిష్కారమైనంది. మా కాలనీలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. మంచినీటి పైప్‌లైన్లు వేసి కొత్తగా కనెక్షన్లు ఇచ్చారు. ఇంతకుముందు ఇక్కడ కనెక్షన్లు లేవు. ఇప్పుడు సంతోషంగా ఉన్నాం.

– ఎం.శేషు, దత్తసాయినగర్

మెట్ల మార్గం నిర్మించారు



ఇన్నాళ్లకు మా కాలనీకి మెట్ల మార్గం వచ్చింది. అంతకు ముందు ఎన్నో ఏళ్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు మెట్ల మార్గం కూడా వేశారు. ఇప్పుడు రాకపోకలకు చాలా సౌకర్యవంతంగా ఉంది.

– కె.గణేష్, నాగనూకాంబికా కాలనీ

కొండవాలులో చాలా సౌకర్యాలు వచ్చాయి



మాది కొండవాలు ప్రాంతం. రిటైనింగ్ వాల్ లేకపోవడంతో వర్షం వస్తే భయంగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్య పరిష్కారమైంది. మా కొండవాలు ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మించారు. మెట్ల మార్గం వేశారు. సీసీ రోడ్లు, డ్రైన్లను అందుబాటులో తెచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– జి.రమేష్, అరుణోదయ కాలనీ

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్



ఉక్కునగరం సమావేశంలో అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని గాజువాక వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమరనాథ్ తెలిపారు. ఉక్కునగరంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని మొట్టమొదట వ్యతిరేకించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ముఖ్యమంత్రి ఈ అంశంపై కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు చేయాలని అనేక సార్లు ప్రధానికి విజ్ఞప్తి చేశారన్నారు. గత మూడేళ్లగా ఉద్యమం జరుగుతున్నా ఎటువంటి కేసులు పెట్టకపోవడం బట్టి తాము ఉద్యమానికి ఎంత మద్దతు ఇస్తున్నాం అనేది తెలుస్తుందన్నారు. చంద్రబాబు హయాంలో పెట్టిన కేసులకు ఇప్పటి వరకు కోర్టుల చుట్టూ తిరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ప్రైవేటీకరణ చేస్తామని చెప్పిన బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలతో మీకు న్యాయం జరుగుతుందా ఆలోచించాలని కోరారు. పార్టీ నాయకులు వై.మస్తానప్ప, డి.సంపూర్ణం, పుల్లారావు,మహాలక్ష్మి నాయుడు, ఇ.సన్యాసి నాయుడు, బి.ఆదినారాయణ, ఉమాశంకర్, వై.కోటేశ్వరరావు, రత్నరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ గెలుపునకు పాటుపడే ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటానని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వారికి తగిన ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. 85వ వార్డు లేమర్తిలోని కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నమ్మకంగా ఉన్నవారికి పార్టీ తగిన స్థానం కల్పిస్తుందన్నారు. గాజువాకలో ప్రతీ అణువు తెలిసిన వ్యక్తిగా గాజువాక సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందిస్తానన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఇల్లపు ప్రసాద్, వాడపల్లి రామచంద్రరాజు, నక్కా రమణబాబు, బొడ్డ గోవింద్, గెద్దాడ సత్యవతి, పిల్లా కొండలరావు, పెదిరెడ్ల హరీష్, సాలాపు అచ్చిబాబు, ఎల్.వి.రమణ, వై.అప్పారావు, డి.సత్యవేణి, డి.అప్పలనాయుడు, బి.శ్రీను, గెద్దాడ అప్పలరాజు,అప్పారావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటేయండి

- 'గుడివాడ' మూడో తరం నాయకుడిగా ఆదరించండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

పెదగంట్యాడ: అభివృద్ధి చూసి తనకు ఓటు వేయాలని రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. వైఎస్సార్ సీపీ 75వ వార్డు నాయకుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి (బుజ్జి) ఆధ్వర్యంలో అయ్యన్నపాలెంలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతం నుంచి తన తాత గుడివాడ అప్పన్న, తండ్రి గుడివాడ గురునాథరావు ప్రాతినిధ్యం వహించారని, మూడో తరం నాయకుడిగా తనను ఆదరించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాజువాకను ఎంతో అభివృద్ధి చేశారని, వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరింతగా ప్రగతిపథంలో నడిపిస్తానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలో 2500 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమం అమలు చేశామన్నారు. ఇక్కడ 25వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న వైఎస్సార్‌సీపీకి ఉక్కు ఉద్యోగులు, కార్మికులు అండగా నిలవాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ వార్డు నుంచి భారీ మెజార్టీ కట్టబెట్టాలన్నారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో తనను ఎలా గెలిపించారో, ఈ ఎన్నికల్లో అమర్‌నాథ్‌ను, బొత్స ఝాన్సీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, మాజీ కౌన్సిలర్ కొయ్య భారతి, గుడివాడ లతీష్, గొందేశి వెంకటరమణా రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసరాజు, గొందేశి ప్రభాకర్ రెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి నాగు, ధర్మాల శ్రీను, పైడిరెడ్డి, మోటమర్రి అప్పలరాజు, రోజారాణి, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



అమర్‌నాథ్, నాగిరెడ్డి, దేవన్‌రెడ్డిలను గజమాలలతో సత్కరిస్తున్న నాయకులు



అమర్‌నాథ్‌కు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



సమావేశానికి హాజరైన ప్రజలు

'బార్స్ రిజిస్ట్రేషన్‌కు సహకరించండి'



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్

ఉక్కునగరం: బయోమెట్రిక్ అటెండెన్స్ రికార్డింగ్ సిస్టం (బార్స్) రిజిస్ట్రేషన్‌కు అందరూ సహకరించాలని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కోరారు. బార్స్ అంశంపై ఉక్కు పరిపాలన భవనంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బార్స్‌పై సమస్యలను యాజమాన్యానికి తెలియజేశారు. దీనిపై సీఎండీ మాట్లాడుతూ రెండు నెలల పాటు బార్స్, డార్స్ రెండూ అమలు చేస్తామన్నారు. బార్స్ కారణంగా ఈ రెండునెలలు జీతంలో కోతలు ఉండబోవని సీఎండీ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. మిగతా సమస్యలు బార్స్ కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారన్నారు.డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే, ఉన్నతాధికారులు, కార్మిక నాయకులు ఆదినారాయణ, రాజశేఖర్, అయోధ్య రామ్, రామచంద్రరావు, మస్తానప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఉమారామలింగేశ్వర స్వామి పరస

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమలిక ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం పరస నిర్వహించారు. వేకువజాము నుంచే ఉమారామలింగేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే రమారహిత వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తప్పెటగుళ్లు, ఆర్కెస్ట్రా, భజనలు అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం 8 కోలాటం బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. స్వామి వారిని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు బి.వాసుదేవశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిలకా అప్పారావురెడ్డి, కేవీఎస్ఎన్ రాజు, నానాజీ పాల్గొన్నారు.



స్వామి వారి సన్నిధిలో అమర్‌నాథ్

వైభవంగా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలోని శ్రీ రుణ విమోచన లక్ష్మీ గణపతి ఆలయం నాలుగో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అగనంపూడి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సామూహిక లలిత సహస్ర పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దానబాల అప్పలనాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో 225 మందికి వైద్యసేవలు



ఆరోగ్య సురక్ష శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు



రోగికి బీపీ పరిశీలిస్తున్న సిబ్బంది

అగనంపూడి: లంకెలపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో బుధవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 79, 85 వార్డులకు చెందిన లంకెలపాలెం, ఫార్మాసిటీ, అగనంపూడి పరిసర గ్రామాల నుంచి 225 మంది వైద్య సేవలు పొందారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యలత మాట్లాడుతూ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అన్ని వార్డుల్లో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చైతన్య వర్మ, ఈఎన్‌టీ డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది షేక్ భూలక్ష్మి, రమణ బాబు, ఆరోగ్య సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు పోరాటం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికుల పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. వారి సంకల్పానికి, పోరాట శక్తికి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1133వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



గాంధీనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



చిత్తడిగా మారిన వుడా కాలనీ మెయిన్ రోడ్

గాజువాక/పెదగంట్యాడ: బంగాళాఖాతంలో ద్రోణి కారణంగా గాజువాకలో బుధవారం వర్షం కురిసింది. ఉదయం ప్రారంభమైన వాన ఓ మోస్తరుగా నిర్విరామంగా కురుస్తుండటంతో రోడ్లపై నీరు నిలిచింది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పాతగాజువాక, కణితి రోడ్ చినగంట్యాడ వద్ద, వుడా కాలనీ, జాతీయ రహదారిపై గల కుంచుమాంబ ఆలయం, వడ్లపూడి ఫ్లై ఓవర్ వంతెన వద్ద నీరు కొద్దిసేపు నిలిచిపోయింది. పెదగంట్యాడ మండలంలో ఉదయం నుంచి మబ్బు పట్టి మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభమైంది. సాయంత్రం వరకు వాన పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.